ఉత్సాహంగా యోగా వాక్



సిరిసిల్లలో యోగా వాక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్లు

సిరిసిల్ల జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా సోమవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఆయుష్ ఆధ్వర్యంలో 2కే యోగా వాక్ నిర్వహించారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నుంచి బతుకమ్మ ఘాట్ వరకు 2కే రన్ ఎంతో ఉత్సాహంగా సాగింది. యోగాపై అవగాహన కల్పిస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శశిప్రభ, సహాయ నోడల్ అధికారులు డాక్టర్ సౌమిని, డాక్టర్ శ్వేతా, డాక్టర్ కళ్యాణి, డీపీఎం తిరుపతి, డాక్టర్ నయీమా, డాక్టర్ బెయుల కుమారి, డాక్టర్ సాయిదీప్తి, ప్రవీణ్ కుమార్, ఆయుష్ యోగా శిక్షకులు బి శ్రీనివాస్, టి సప్న, ఎలిగేటి కృష్ణ, బి రిషిక, పి దేవయ్య,బి అశోక్, వి పుష్పలత, సిహెచ్ ధర్మపురి, టీ రవళి, జె శ్రీకాంత్, ఎస్ శిరీష, ఎస్ కృష్ణహరి, బి అఖిల, డి నిత్య,ఉప్పల శ్రీనివాస్, బిల్లా శ్రీకాంత్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ విద్య అందేనా..?





ఈ సారి ఇంటర్ అర్హత..

అంగన్‌వాడీ, ఆయాల భర్తీకి సంబంధించి గతంలో విద్యార్హతల్లో టీచర్లకు పదవ తరగతి, ఆయాలకు 7వతరగతి ఉంది. ప్రీస్కూల్‌గా మార్చి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పూర్వ విద్యను అందించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీంతో ఈసారి టీచర్లు, ఆయాలకు ఇంటర్మీ డియేట్ అర్హతగా నిర్ణయించారు. టీచర్లు, అయాలకు వయస్సు 18 నుంచి 35 ఏళ్లుగా నిర్ణయించారు. ఇప్పటికే జిల్లా సంక్షేమ శాఖ అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి సంబంధించిన ఖాళీల నివేదికలను ప్రభుత్వానికి పంపించారు.



జిల్లాలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట ర్యాలీ

- అంగన్‌వాడీల్లో వెక్కిరిస్తున్న ఖాళీలు
- టీచర్లు 43, ఆయాలు 174 పోస్టులు ఖాళీ
- ఈ నెలలో మరో 20 మంది ఉద్యోగ విరమణ
- ఇన్‌చార్జీలతో లబ్ధిదారులకు అందని సేవలు
- జిల్లాలో 557 అంగన్‌వాడీ కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడంతో పాటు చిన్నారులకు ప్రీస్కూల్ విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసినా అంగన్‌వాడీల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి.

మరో వైపు అంగన్‌వాడీ కేంద్రాలు పోషకాహార కేంద్రాలుగా పనిచేస్తున్నా చాలాచోట్ల సరైన సిబ్బందిలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పూర్వ ప్రాథమికవిద్యపై అవగాహన కల్పించేందుకు అమ్మమాట.. అంగన్‌వాడీ బాట పేరుతో చేపట్టిన కార్యక్రమాలు ఈనెల 17తో ముగిసిపోతున్నాయి. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల వైపు మళ్లించే దిశగా ప్రయత్నం జరుగుతున్నా అమ్మమాట మాత్రం వినిపించడం లేదు. జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీలభర్తీ చేపట్టక పోవడంతో ఇన్‌చార్జీలతో పూర్వ ప్రాథమికవిద్య, పోషకాహార పంపిణీలో ఇబ్బందులు కనిపిస్తున్నాయి. స్త్రీశిశు సంక్షేమశాఖ అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా వివిధ కార్యక్రమాలను చేపడు తున్న క్రమంలో అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం ప్రకటించింది. 65ఏళ్లతో పదవీ విరమణ చేసిన టీచర్లకు రూ. రెండులక్షలు, ఆయాలకు రూ.లక్ష రిటైర్మెంట్ బెని ఫిట్స్ ఇవ్వనున్నారు. కానీ జిల్లాలో మాత్రం అంగన్ వాడీ కేంద్రాల్లో ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. 2020- 2021లో ఖాళీలు భర్తీ చేశారు. తర్వాత వివిధ కారణాలతో భర్తీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ప్రధానంగా రిజర్వేషన్ల సమస్య ఉన్నట్లుగా చెబుతు న్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీల ఖాళీలు భర్తీ చేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. కానీ ఆచరణలోకి మాత్రం రాలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీల భర్తీ అర్హులను ఊరిస్తూ, వెక్కిరిస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రీస్కూల్, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించడం ప్రశ్నార్థకంగానే మారుతుంది.

43 మంది టీచర్లు, 174 అయా పోస్టులు ఖాళీ

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో 20 మినీ కేంద్రాలు ఉండగా వాటిని పూర్తి స్థాయి కేంద్రాలుగా మార్చారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో రిటైర్‌మెంట్ ప్రక్రియను అమలోకి తేవడంతో జిల్లాలో 122 పోస్టులు ఖాళీ అయ్యాయి. గతంలో ఉన్న ఖాళీలతో కలుపుకుని జిల్లాలో 217 పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో 43 టీచర్లు, 174 అయాలు ఖాళీగా ఉన్నాయి. ఈ నెలలో మరో 20మంది టీచర్లు, ఆయాలు పదవీ విరమణ పొందనున్నారు. సిరిసిల్ల....

మిగతా 8లో

పాఠశాల సమయానికి బస్సులు నడపాలి

వీర్నపల్లి, జూన్16(ఆంధ్రజ్యోతి): మారుమూల పల్లెల నుంచి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థుల కోసం పాఠశాల సమయానికి అనుగుణంగా బస్సులను నడిపించాలని సిరిసిల్ల డిపో మేనేజర్‌కు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ అశోక్ వినతిపత్రాన్ని అందించారు. బస్సులు సమయా నికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట పీఈటీ ప్రతాప్ ఉన్నారు.



డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్

కేటీఆర్‌ను విచారించడం రాజకీయ కక్ష సాధింపే



హైదరాబాద్‌కు తరలివెళ్లిన చందుర్తి బీఆర్ఎస్ నాయకులు

చందుర్తి జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఫార్ములా ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను పదేపదే విచారణకు పిలవడం పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు అని బీఆర్ఎస్ పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు మ్యాకల ఎల్లయ్య అన్నారు. సోమవారం ఏసీబీ కార్యాలయంలో కేటీఆర్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో చల్మెడ లక్ష్మీనరసింహారావు ఆదేశం మేరకు చందుర్తి మండలం నుంచి పార్టీ శ్రేణులు హైదరాబాద్ తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మాజీ ఏఎంసీ చైర్మన్ లు డప్పుల అశోక్, ఎనుగుల శ్రీనివాస్, మాజీ సెస్ డైరెక్టర్ సంటి బాపూరావు, నాయకులు భైరగోని రమేష్, ఎండి ఇస్మాయిల్, మాదాసు ప్రసాద్, పోతారాజు తిరుపతి, పెదిగారి మహేష్, బత్తుల వంశీ తదితరులు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదల

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసిందని జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి శ్రీనివాస్ ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియేట్ మొదటి సంవతర్సంలో జనరల్‌లో 2,210 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 1,293 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో మొదటి సంవత్సరం 176 మందికిగాను 126 ఉత్తీర్ణులయ్యారు. దితీయ సంవత్సరం జరనల్‌లో 1,379 మంది విద్యార్థులకు 727 మంది ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం ఒకేషనల్‌లో 104 మందిగాను 51 మంది ఉత్తీర్ణులైనట్లు డీఐఈవో శ్రీనివాస్ తెలిపారు.

నిరుపేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేద ప్రజల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పనిచేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరోగ్య పరిధిని పెంచిందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రానివారికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. సీఎం సహాయనిధి చెక్కులను ప్రతినెలా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వైద్య ఖర్చులు పెట్టుకున్న వారు నేరుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు రంగాల్లో ముందుకుపోతుందన్నారు. రాష్ట్రంలో పేదప్రజలు బాగుపడటాన్ని కొన్నిపార్టీలు జీర్ణించుకోలేక తప్పుడు ప్రచారాన్ని చేస్తున్నారని, ప్రజలు వారి ఆరోపణలను పట్టించుకోవద్దన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 41మందికి సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు వెంకటరమణారెడ్డి, గుడిసె అయిలయ్యయాదవ్, మాజీ ప్యాక్స్‌చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, ఏఎమ్‌సీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు చల్ల నారాయణ, నాయకులు మామిడి నరేష్, మాధవరెడ్డి, ఎలుక రామస్వామి, సుదగోని తిరుపతి, ఖాత మల్లేశం, మంద పెద్దబాల్‌రెడ్డి, రవి, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి



ఇల్లంతకుంట రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యనారాయణ, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా



కోనరావుపేటలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లయ్య

- రైతునేస్తం కార్యక్రమంలో ఎమ్మెల్యే, కలెక్టర్

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్‌ఝాలు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతువేదికలో ప్రతి మంగళవారం వ్యవసాయ శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు సాగుపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 1031 రైతువేదికలలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధానం చేయడం జరిగిందన్నారు. రైతులు కార్యక్రమాలను చూసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. మండలంలోని రేపాక, వల్లంపట్ల గ్రామాలలోని రైతువేదికలలో సైతం రైతునేస్తం కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్యయాదవ్, మాజీ ప్యాక్స్ చైర్మన్ ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, ఏఎమ్‌సీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పసుల వెంకటిలతో పాటు ఏఈఓలు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతులకు పెద్దపీట

కోనరావుపేట : కాంగ్రెస్ పాలనలో రైతులకు పెద్దపీట వేసిందని కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. కోనరావుపేట మండలం నిజామాబాద్ మార్కెట్ కమిటీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని మాట్లాడారు. రైతులను చైతన్యవంతం చేసేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభిస్తూ రైతులకు వ్యవసాయ అధికారులు కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు ఇస్తున్నారని అన్నారు. సన్న వడ్లకు కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులతో పాటు రైతులు ముచ్చిడి రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతు వేదికల్లో ప్రభుత్వ సేవలు...

వీర్నపల్లి : రైతువేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయకుమారితో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటరమణ, ఏఎస్‌వో రమణ. ఏఎంసీ డైరెక్టర్ చంద్రమౌళి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూత శ్రీనివాస్. నాయకులు కాంతయ్య, బాబు, రైతులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు

చందుర్తి: చందుర్తి మండల కేంద్రంతో పాటు మర్రిగడ్డ, మూడపల్లి, మల్యాల, గ్రామాల్లోని రైతు వేదికల్లో నూతనంగా రైతు నేస్తం కార్యక్రమను ప్రారంభోత్సవం, రైతు భరోసా నిధుల విడుదలపై సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో అధికారులు రైతులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో వేములవాడ ఏడీఏ రామారావు, మండల వ్యవసాయ అధికారి అనూష, ఇన్చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్, ఏఈవోలు యోగేశ్వర్, రమ్య, శిరీష, శారద, ప్రవీణ్, ఏఎంసీ డైరెక్టర్లు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.



వీర్నపల్లిలో వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, రైతులు



చందుర్తిలో పాల్గొన్న రైతులు, అధికారులు

అంబేద్కర్ యువజన సంఘం కమిటీకి సన్మానం



అంబేద్కర్ యువజన సంఘం కమిటీని సన్మానిస్తున్న నాయకులు

వీర్నపల్లి జూన్16, (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన అంబేడ్కర్ యువజన సంఘం కమిటీ అధ్యక్షుడు గజ్జెల ప్రశాంత్‌తో పాటు సంఘ సభ్యులను అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో శాలువాలతో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇందిరమ్మ ఇళ్లలో అర్హులకు అన్యాయం

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట ఎంపీడీవో కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు సోమవారం దర్నా చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవకలు జరిగాయని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అర్హులకు అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికైనా అనర్హులను తొలగించి, అర్హులను గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవకతవలను సరిచేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ దర్నాలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోడె రమేష్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, మైనార్టీ మోర్చా అధ్యక్షుడు వాజీద్ హుస్సేన్, నాయకులు దేవేందర్, సత్యానారాయణ, మల్లేశ్, నర్సింలు, ప్రశాంత్, స్వామి, దుర్గేష్, భాస్కర్, రాజేష్, శ్రీదర్, సంతోష్ తదితరులు ఉన్నారు.



దర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

బీసీలకు రిజర్వేషన్లు ప్రకటించాకే ఎన్నికలకు వెళ్లాలి

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేసి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని మండల బీసీ సాధికారిత సంఘ అధ్యక్షుడు గజ్జల రాజశేఖర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా బీసీలను రాజకీయపార్టీలు వాడుకొని వదిలిపెడుతున్నాయని పేర్కొన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నందున చట్టపరమైన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని విరమించుకోవాలి
- మావోయిస్టుల పేరుతో అదివాసీలను అంతం చేయడం సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
7

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి
- వేములవాడలో రోడ్ల విస్తరణతో నిరీక్షణకు తెర
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
7

బడుగు, బలహీన వర్గాలకు మంత్రి పదవులు
- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
7

రైతుల కోసమే రెవెన్యూ సదస్సులు

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సౌలభ్యం కోసమే గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఫారూఖ్ పేర్కొన్నారు. మండలంలోని వంతడుపుల, సోమారంపేట గ్రామాలలో సోమవారం రెవన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో సాదాబైనామాలపై దరఖాస్తు చేసుకున్నవారివి విచారణ జరిపి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వంతడుపుల గ్రామంలో 75దరఖాస్తులు, సోమారంపేట గ్రామంలో 38మంది రైతులు దరఖాస్తులు పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐలు సంతోష్, శశికుమార్, కృష్ణ, సింగారెడ్డిలతో సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌శాఖపై భరోసా కలిగేలా గ్రీవెన్స్ డే

- ఎస్పీ మహేశ్ బి. గీతే

సిరిసిల్ల క్రైం, జూన్ 16(ఆంధ్రజ్యోతి): పోలీస్‌శాఖపై భరోసా , నమ్మకం కలిగేలా గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో 23 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి గ్రీవెన్స్ డే ఉపయోగపడుతుందన్నారు. అర్జిదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలకు ఫోన్‌చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించామన్నారు. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా , ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషిచేయడం జరుగుతుందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి వినతులు, ఫిర్యాదులు స్వీకరించి అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్‌శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటి కప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించడం జరుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బి. గీతే

పిల్లలు పుట్టడం లేదని మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

సైదాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకునూర్ గ్రామంలో తేజస్విని(26) అనేవివాహిత సంతానం కావడం లేదని మనస్థాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాలజిల్లా జగిత్యాల మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కోడిపెల్లి లక్ష్మి-కిషన్‌ల కూతురు తేజస్విని కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం ఆకునూర్ గ్రామానికి చెందిన జెల్ల సతీష్‌కు ఇచ్చి 2020లో వివాహం జరిపించారు. అప్పుడప్పుడు తేజస్విని తనకు పెళ్లై 5సంవత్సరాలు అవుతున్నా సంతానం కావడం లేదని బంధువులకు చెబుతూ బాధ పడేది. పిల్లలు పట్టడం లేదని మనోవేదనకు గురై ఈనెల 13న ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు తేజస్వినిని జమ్మికుంటలోని ఓ ప్రైయివేట్ హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేపించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు వారు తెలిపారు. మృతురాలి తల్లి కోడిపెల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సైదాపూర్ ఎస్సై తిరుపతి తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

జమ్మికుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అప్పు ఇచ్చిన వ్యక్తి ఇంటి మీదకు వచ్చి ఇష్టం వచ్చినట్లు దూషించడంతో అవమానభారంతో మందు గోళీలు వేసుకొని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని దుర్గా కాలనీకి చెందిన పకిడే రవి అనేవ్యక్తి సల్ల రాజమ్మ దగ్గర అవసరం నిమిత్తం రూ.70వేలు అప్పుగా తీసుకున్నాడు. రాజమ్మ భర్త సమ్మయ్య సోమవారం అప్పుతీసుకున్న రవి ఇంటిమీదకు వచ్చి డబ్బులు ఎప్పుడు ఇస్తావంటూ నానా బూతులు తిట్టాడు. పరువు పోయిందని భావించిన రవి భార్య కవిత ఇంట్లో ఉన్న మందు గోళీలు(టాబ్లెట్స్) అన్ని ఒకేసారి మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బాధితురాలి కుమారుడు మణికంఠ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సమ్మయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి బలవన్మరణం

కోరుట్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్లరూరల్ మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన అగ్గ ఆశన్న(59) అనేవ్యక్తి ఆదివారం రాత్రి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. ఆశన్నకు సంతానం లేకపోవడంతో పాటు భార్య మల్లుతో కుటుంబ కలహాలు రావడంతో కొంతకాలంగా ఆమె రాయికల్‌లో తల్లి గారి ఇంట్లో ఉంటోంది. దీంతో ఆశన్న మద్యానికి బానిసై ఆదివారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గమనించి కోరుట్ల పోలీసులకు సమాచారం అందించారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్జాలో కరీంనగర్‌వాసి మృతి


ఖాజా మెహరాజ్(ఫైల్)

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని కశ్మీర్‌గడ్డ ప్రాంతానికి చెందిన ఖాజా మెహరాజ్(46) ఆదివారం రాత్రి షార్జాలో మృతి చెందాడు. ఖాజా ఎనిమిదేళ్లుగా షార్జాలో అల్‌ఖైరిన్‌బాయ్స్‌పాఠశాలలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం కరీంనగర్ నుంచి ఆయన కుటుంబసభ్యులు ఫోన్‌చేసినా స్పందించకపోవడంతో అక్కడేఉన్న వారిబంధువులకు సమాచారం అందించారు. బంధువులు ఆయన గదికి వెళ్లి చూడగా మంచంపై విగతజీవిగా పడి ఉన్నాడు. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబసభ్యులు భావిస్తున్నారు. మెహరాజ్‌కు భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

గంజాయి పట్టివేత..ముగ్గురి అరెస్ట్

తిమ్మాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎల్ఎండీ పోలీసులు గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పట్టుకొని సోమవారం సాయంత్రం మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా తిమ్మాపూర్ సీఐ మాట్లాడుతూ ఈనెల15నసాయంత్రం 5గంటలకు మండలంలోని కొత్తపల్లి గ్రామఎక్స్‌రోడ్డు వద్ద ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారన్నారు. ఆసమయంలో ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై కరీంనగర్ వైపునకు వస్తుండగా వారిని ఆపి తనఖీ చేశారు. ఈ తనిఖీల్లో వారివద్ద ఉన్న బ్యాగులో 5కిలోల గంజాయి లభించింది. గంజాయితో దొరికిన నిందితులలో వేములవాడ మండలం, నాగయ్యపల్లి గ్రామానికి చెందిన గొంటి నగేష్(19), కోనరావుపేట మండలం, మట్టిమల్ల గ్రామానికి చెందిన చెప్యాల సాత్విక్(19), వేములవాడ అర్బన్ కాలనీకి చెందిన కుత్తడి భరత్(19) ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ సదన్ కుమార్ తెలిపారు.

ఒడిస్సా నుంచి గంజాయి: గంజాయి తాగడానికి బానిసై పోలీసులకు దొరికిన ముగ్గురు జల్సాలకు అలవాటు పడ్డారు. గంజాయి కొనుగోలు చేసి అనంతరం ఎక్కువ ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలనుకున్నారు. గంజాయి ఎక్కడ దొరుకుతుందో తెలుసుకొని నాలుగు రోజుల క్రితం బైక్‌పై ఒరిస్సాకు వెళ్లి అక్కడ గంజాయిని కొనుగోలు చేసి తిరిగి వస్తున్నారన్నారు.



ఇంటింటికీ ఇంటర్నెట్ ఇంకెప్పుడు?

- అసంపూర్తిగా టీ-ఫైబర్ పనులు
- గ్రామ పంచాయతీల్లో అందని ఈ-సేవలు
- నెట్ సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోని గ్రామాలు

భగత్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికి ఇంటర్‌నెట్ సౌకర్యం ప్రశ్నార్థకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యం అందించాలన్న లక్ష్యంతో ప్రారంభించిన టీ-ఫైబర్ పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గ్రామాల్లో సత్వర సేవలు, పరిపాలన సౌలభ్యం కోసం పంచాయతీ కార్యాలయాలతో పాటు, ప్రతి ఇంటికి ఇంటర్‌నెట్ సేవలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. 2015 సంవత్సరంలో ప్రారంభమైన పనులు 2022 నాటికే పూర్తి కావాల్సి ఉన్నా


ఇంటర్‌నెట్ కోసం కొత్తపల్లి మండలంలో వేసిన పైపులైన్

నిధుల కొరత, అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాతాల్లో డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడంలేదు.

పైప్‌లైన్‌తోనే సరి...

జిల్లా వ్యాప్తంగా 17 మండలాల్లో 313 గ్రామ పంచాయతీలు ఉండగా, గ్రామాల్లో ఇంటింటికి 20 ఎంబీపీ ఎస్, విద్యాలయాలు, పంచాయతీ కార్యాలయాలకు ఒక జీబీపీ ఎస్ కనీస వేగంతో బ్రాడ్ బ్యాండ్ సేవలను తక్కువ ధరలకే అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ పథకం భారత్‌నెట్‌లో భాగంగా అన్ని గ్రామ పంచాయతీలను కలుపుతూ మిషన్ భగీరథ పైపులైన్‌తోపాటు అండర్ గ్రౌండ్‌లో ఫైబర్ ఆప్టికల్ కేబుల్ (ఓఎఫ్‌సీ) నిర్మాణ పనులు చేపట్టారు. మండల కేంద్రాల్లో ఆప్టికల్ లింక్ సెంటర్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి గ్రామాలను అనుసంధానం చేశారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు ఉన్న చోట ఎంఐ బాక్సులు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా సోలార్ ఇన్వర్టర్లు ఏర్పాటు చేశారు. పెండింగ్ పనులను నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా ఇంటర్‌నెట్ కనెక్షన్లు అందుబాటులోకి రావడం లేదు. విస్తృత ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టు పనులు పూర్తి చేసి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సేవలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

మాన్యువల్‌గానే పనులు

గ్రామ పంచాయతీల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం లేకపోవడంతో ఇప్పటికీ కార్యకలాపాలు మాన్యువల్‌గానే సాగుతున్నాయి. గ్రామానికి సంబంధించిన ఏదైనా సమాచారం కావాలంటే రికార్డులు వెతకాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వివిధ అనుమతి పత్రాలు, లైసెన్స్ రసీదులు ఏదీ కావాలన్న కాగితంపై రాసి ఇస్తున్నారు. గ్రామ పంచాయతీల్లో వివిధ ఫైళ్ల నిర్వహణ, జనన మరణ ధ్రువీకరణ పత్రాల జారీ, పంచాయతీ ఆదాయం, ఆమోదించిన చెక్కులు, జీతాల రసీదులు ఇలాంటి పనులన్నీ మాన్యువల్‌గానే చేస్తున్నారు. ప్రతి నెల ఆదాయ వ్యయాలను ఆన్‌లైన్ అడిట్ చేయాల్సి ఉంటుంది. ఇలాంటి పనులన్నింటికి ఇంటర్‌నెట్ అవసరం ఉంటుంది.

టీ-ఫైబర్ ప్రారంభిస్తే అందుబాటులోకి ఎన్నో సేవలు

గ్రామీణప్రాంతాల్లో టీ-ఫైబర్ ఇంటర్‌నెట్ సదుపాయం కల్పిస్తే ఎన్నో సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామాల్లో రేషన్ డీలర్లు, పోస్టల్ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బందికి ఆన్‌లైన్‌లో పలు విషయాలు అప్‌లోడ్ చేస్తుంటారు. టీ- ఫైబర్ పనిచేయడం ప్రారంభమైతే ఈ బ్యాంకింగ్, ఈ గవర్నెన్స్, సోషల్ వైఫై, టెలి మెడిసిన్ వీడియో కాన్ఫరెన్స్‌లు, ఈ క్లాస్ లాంటి సేవలు అందుబాటులోకి వస్తాయి.

పనులు వెంటనే పూర్తి చేయాలి: కడారి రతన్‌కుమార్, ఎలగందల్



ప్రస్తుత కాలంలో ప్రతి విషయం ఇంటర్‌నెట్‌తో ముడిపడి ఉన్నది. టీ-ఫైబర్‌తో ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇవ్వాలనే ప్రభుత్వ లక్ష్యం మంచిదే. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా కనెక్షన్లు ఇవ్వడం లేదు. ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇస్తే గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో ఓఇంట్లో పేకాట ఆడుతున్న నలుగురు పేకాటరాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా, స్వామి, అమీర్, శంకర్, రాజు పేకాట ఆడుతుండగా పట్టుబడ్డారని ఎస్ఐ ప్రేమానందం తెలిపారు. వారినుంచి రూ.8,200నగదు, మూడు సెల్‌ఫోన్లు, రెండుబైకులు, పేకాటముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నలుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రేమానందం తెలిపారు.

హత్యాయత్నం కేసులో తొమ్మిది మంది రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటలో భూ వివాదంలో కొలకాని పరుశరాములు, అతని కుటుంబ సభ్యులపై ఈ నెల 14న హత్యాయత్నానికి పాల్పడిన సంఘటనలో ప్రధాన నిందితుడైన కొలకాని శ్రీనివాస్‌తో సహా 9మందిని సోమవారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సిరిసిల్ల టౌన్ సీఐ కె. కృష్ణ వివరాల ప్రకారం... పట్టణంలోని చంద్రంపేట గ్రామంలో కొలకాని అంజయ్య, అతని సోదరుడి కుమారులైన కొలకాని శ్రీనివాస్, నాగరాజుల మధ్య గత కొన్ని రోజుల నుంచి ఇంటి స్థలం వివాదం నెలకొంది. దీంతో నాగరాజు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు ఇంటి స్థలాన్ని జేసీబీతో చదును చేయడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవను మనసులో పెట్టుకున్న శ్రీనివాస్, నాగరాజులు మరికొంత మందితో కలిసి అంజయ్య కుటుంబాన్ని చంపితే భూమి తమ వాళ్లకే చెందుతుందని పథకం పన్నారు. ఈ పథకం ప్రకారం అంజయ్య కుటుంబ సభ్యులను శ్రీనివాస్, నాగరాజు, మంగ, మమత, ఎల్లవ్వలు కలిసి బూతు మాటలు తిడుతూ వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామానికి చెందిన వేముల పెద్దభూమయ్య, అతని కుమారులు నాగరాజు, ప్రశాంత్‌లు కలిసి పర్శరాము లును దొరకబట్టడంతో వెంటనే అతనిపై శ్రీనివాస్ కత్తితో దాడిచేసి పొడిచాడు. పర్శరాములు తండ్రి అంజయ్య, తల్లి లచ్చవ్వను బండరాయితో దాడిచేయగా తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితులు ఫిర్యాదుచేయడంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అయితే ప్రధాన నిందితుడైన శ్రీనివాస్ ఓ న్యాయవాది ద్వారా కోర్టులో సరెండర్ అయ్యాడు. సరెండర్ అయిన శ్రీనివాస్‌తో పాటు చంద్రంపేటకు చెందిన కొలకాని నాగరాజు, కొలకాని మంగవ్వ, కొలకాని మమత, కొలకాని ఎల్లవ్వ, వేములవాడ అర్బన్ మండలంలోని వేముల పెద్ద భూమయ్య, వేముల నాగరాజు, వేముల ప్రశాంత్, వేముల మల్లేశంలను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని సీఎం తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికపై మహిళల ఆందోళన

ధర్మపురి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం పెద్దనక్కలపేట గ్రామపంచాయితీ ఎదుట సోమవారం పలువురు మహిళలు ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇటీవల పంపిణీ చేసిన ఇళ్ల మంజూరు పత్రాల్లో పలువురు అర్హులకు చోటు దక్కలేదని వాపోయారు. అనర్హులకు ఇళ్లు కేటాయించి తమకు అన్యాయం చేశారని మహిళలు ఆరోపించారు. కిరాయి ఉంటున్న వారిని, వితంతువులకు, దారిద్ర్యరేఖకు దిగువఉన్న వారికి ముందుగా ఎంపిక చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. మొదటి లిస్ట్‌లో లబ్ధిదారులుగా తమ పేరు వచ్చిందని, దీంతో తాము పాత ఇళ్లను కూల్చి వేసుకున్నా మని పలువురు మహిళలు తెలిపారు.

కానీ ప్రస్తుతం లిస్ట్‌లో పేరు లేదని, ఉన్న ఇళ్లు పోగొట్టుకున్నామని ఆకుల అనిల్ అనే వ్యక్తి ఆవేదన చెందారు. ప్రభుత్వం తమకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మహిళలు డిమాండ్ చేశారు.


గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

మహిళపై దాడి

సుల్తానాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం కదంబాపూర్ గ్రామపంచాయతీ అనుబంధంగా ఉన్న కాశపల్లిలో సోమవారం ఓ మహిళపై దాడి జరిగింది. కాశపల్లిలో కొందరు గొడవ పడుతుండగా ఫాతిమా అనే మహిళ అడ్డుకోవడంతో అందులో ఒకరు ఆమెను కర్రతో తలపై కొట్టగా తీవ్రగాయమైంది. ప్రస్తుతం ఆమెపరిస్థితి విషమంగా ఉంది. సుల్తానాబాద్ ఆసుపత్రికి తీసుకురాగా వరంగల్ ఎంజీఎంకు తరలించాలని వైద్యులు సూచించారు. కుటుంబ సభ్యులు గాయపడ్డ మహిళను కరీంనగర్ తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

- 9మందికి జరిమానా

కోల్‌సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యంసేవించి వాహనాలు నడిపిన ఉప్పల నరేష్, ఆసంపల్లి నగేష్‌లకు మూడు రోజుల జైలు శిక్షను రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్ దుర్వ విధించినట్టు రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 9మందికి రూ.14వేల జరిమానా విధించారని తెలిపారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కారు, బైక్ ఢీ

ముత్తారం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చుపేట, బగుళ్ల పుణ్యస్నానానికి వెళ్లేదారిలో పోతారం చెందిన కట్ల పవన్ ద్విచక్రవాహనానికి కారు ఢీకొట్టడంతో పవన్‌కు తల, ఛాతిభాగంలో గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. పవన్‌ను చికిత్సనిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటి పై కప్పు తొలగించిన మనవడు

- పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు

శంకరపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో ఇంటి పైకప్పును మనవడు తొలగించాడని వృద్ధజంట పోలీసులను ఆశ్రయించిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శంకరపట్నం మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన వేల్పుల కొమురమ్మ-కనకయ్యలకు ముగ్గురు కుమారులు. పెద్దకుమారుడు గణేష్ చనిపోయాడు. మిగతా ఇద్దరు కుమారులు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కాగా కొమురమ్మ-కనకయ్య రాజాపూర్ గ్రామంలోనే నివాసం ఉంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్న కొమురమ్మ-కనకయ్యకు తోడుండాల్సిన మనవడు అదేం పట్టకుండా వీరిని ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ నెల 10న మనవడు ఉదయ్, పెద్దకోడలు లక్ష్మి కలిసి ఇంటిపై కప్పును తొలగించి, ఇంటి గోడను కూడా కూల్చివేసినట్లు తెలిపారు. దీంతో వారు కేశవపట్నం పోలీసులను ఆశ్రయించారు. వృద్ధదంపతులకు ఆసరాగా ఉండి చేరదీయాల్సిన పెద్దకోడలు, మనవడు ఉండేందుకు గూడు లేకుండా ఇంటి పైకప్పుతొలగించి గోడలు కూల్చి వేయడంతో గ్రామంలో చుట్టుపక్కల వారి ఇళ్లలో తలదాచుకునే పరిస్థితి ఏర్పడిందని గోడు వెళ్లబోసుకున్నారు. కాగాబ్లూకోర్టు పోలీసులు రాజాపూర్ గ్రామానికి చేరుకొని ఇంటిపైకప్పు తొలగించి గోడలు కూల్చివేసిన ఘటనపై వివరాలు సేకరించారు.

పురుగుల మందు డబ్బాలతో ప్రజావాణికి రైతులు

- చెరువు భూమిని కాపాడాలని డిమాండ్



జగిత్యాల కలెక్టరేట్‌కు పురుగుల మందు డబ్బాలతో వచ్చిన కొండాపూర్ గ్రామరైతులు

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామ శివారులోని బూరుగుకుంట చెరువును కబ్జా నుంచి కాపాడాలని, మరమ్మతు చేయించాలని రైతులు సోమవారం జగిత్యాల కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజావాణికి క్రిమిసంహారక మందు డబ్బాలతో వచ్చి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు సంబంధిత రైతుల వద్ద నుంచి పురుగుల మందు డబ్బాలను లాక్కున్నారు. అనంతరం కలెక్టర్ సత్యప్రసాద్‌ను రైతులు కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. చెరువు ప్రాంతంలో ఇటీవల భూమికొనుగోలు చేసిన సబ్బనవేణి అంజయ్య అనే వ్యక్తి చెరువు మత్తడిని, చెరువు కట్టను ధ్వంసం చేశాడని రైతులు ఆరోపించారు. చెరువులో నీరు నిలవకుండా చేసి శిఖం భూమిని సాగు చేస్తున్నాడని, దీని వల్ల చెరువు కింద ఉన్న తమ భూముల గుండా నీరు ప్రవహించి తమ పంట కొట్టుకు పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. అనేకసార్లు తహసీల్దార్‌కు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని రైతులు ఆరోపించారు. ఎన్నో సంవత్సరాల నుంచి సాగు చేస్తున్న తమ భూమి పనికి రాకుండా చేస్తున్నాడని రేగుల దేవమ్మ అనే వృద్ధురాలు రోదించింది. తమ సమస్యకు పరిష్కారం లభించకుంటే పురుగులమందు తాగుతా మని రైతులు హెచ్చరించారు. దీంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని కలెక్టర్ సత్యప్రసాద్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించి వెనుదిరిగారు.

బస్సులు ఆపడం లేదని మహిళల ఆందోళన

కథలాపూర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలంలోని తాండ్ర్యాల స్టేజీ వద్ద ఆర్టీసీబస్సులు ఆపడం లేదని మహిళలు సోమవారం ఆర్టీసీ బస్సును నిలిపివేసి ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ తాండ్ర్యాల స్టేజి వద్ద ఆర్టీసీబస్సులు ఆపకపోవడంతో కోరుట్ల, కథలాపూర్ ప్రాంతాలకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్రఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై గతంలో కోరుట్ల డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించినా కనీస స్పందన లేదనివారు విమర్శించారు. మహిళలు అరగంటసేపు బస్సులను నిలిపివేయడంతో డిపోమేనేజర్ మహిళలతో ఫోన్‌లో మాట్లాడి బస్సులు తాండ్ర్యాలస్టేజీ నిలిపేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విమరించారు.


తాండ్ర్యాలలో ఆర్టీసీ బస్సు ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

చోరీ కేసులో మరో నిందితుడి అరెస్టు

- మూడు తులాల బంగారం రికవరీ


నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం వెంకటయ్యపల్లి చోరీకేసులో మరో నిందితుడిని పట్టుకుని, మూడు తులాల బంగారం రికవరీచేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ వెల్లడించారు. సోమవారం గంగాధర పోలీస్‌స్టేషన్‌లో చోరీలో మూడవ నిందితుడు చందుర్తి మండలంకు చెందిన పిట్టల అరవింద్‌ను అరెస్టు చేసి విలేకరులతో మాట్లాడారు. ఆయన వివరాల ప్రకారం ఈనెల 8న మండలంలోని వెంకటయ్యపల్లిలో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 33 తులాల బంగారం నగదు, వెండి ఎత్తుకెళ్లిన్నట్లు తెలిపారు. ఈ చోరీ కేసులో ఈనెల 13న ఇద్దరు నిందితులను పట్టుకుని 20తులాల బంగారం రికవరీ చేయగా సోమవారం మూడో నిందితుడిని పట్టుకుని మరో మూడు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై గతంలో పలు కేసులున్నాయని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన ఎస్సై వంశీక్రిష్ణ, గంగాధర పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

జమ్మికుంట రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ముప్పిడితోట గ్రామానికిచెందిన యువతి చెవుల సౌమ్య(25) జమ్మికుంటలోని తమ సమీప బంధువుల ఇంట్లో మూడు నెలలుగా ఉంటోంది. ఈనెల 14న మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఆమె కనిపించడం లేదు. ఈమేరకు ఆమె సోదరుడు సాయిచరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ ఎస్ రామకృష్ణగౌడ్ తెలిపారు.

లారీని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- 10 మందికి స్వల్ప గాయాలు

కోరుట్ల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు లారీని ఢీకొనడంతో సోమవారం 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. కోరుట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్తుండగా కోరుట్ల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముందుగా వెళ్తున్న లారీనీ ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణం చేస్తున్న శివకుమార్, సుజాత, గంగనర్సు, పద్మ, వనిత, లక్ష్మి, కల్పన, ఉష్మా, మంజుల అనే ప్రయాణికులతోపాటు బస్సు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు అయ్యాయి. హుటాహుటిన ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులను స్థానికప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సను అందించారు. సంఘటనా స్థలాన్ని కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ పరిశీలించారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- ఇద్దరు నిందితుల అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం లింగన్నపేట గ్రామ సమీపాన మానేరు కెనాల్ వద్ద జరిగిన మెండే సతీష్ హత్యకేసును పోలీస్‌లు ఎట్టకేలకు ఛేదించారు. ఈనెల13న లింగన్నపేటకు చెందిన మెండే సతీష్‌ను బీరు సీసాలతో దాడిచేసి దారుణంగా హత్య చేసిన సంగతి తెలిసిందే. నిందితుల కోసం మూడు రోజులుగా పోలీస్‌లు తీవ్రంగా గాలించారు. ఎట్టకేలకు నిందితులను పోలీస్‌లు పట్టుకుని సోమవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరళించారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్, స్థానికఎస్ఐ ప్రేమానందం తెలిపినవివరాల ప్రకారం.. మృతుడు మెండే సతీష్, అదే గ్రామానికి చెందిన నిందితులైన నర్మాల పవన్ కుమార్, భీమయ్యగారి రాజశేఖర్‌లు సుతారి పనికి వెళ్లేవారు. ఈ క్రమంలో మృతుడు సతీష్ తన అవసరాలకు భీమయ్యగారి రాజశేఖర్ వద్ద డబ్బులు అప్పుగా తీసుకున్నాడు. అప్పు డబ్బుల కోసం ముగ్గురి మధ్య గొడవలు జరిగేవి. ఈనెల13న మానేరుకెనాల్ వద్ద నిందితుడైన పవన్ కుమార్, మృతుడు సతీష్ దావత్ చేసుకున్నారు. ఇదే క్రమంలో పవన్ కుమార్‌ను వారి సమీప బంధువులను సతీష్ అసభ్యకరంగా దూషించాడు. ఇదే విషయాన్ని రాజశేఖర్‌కు ఫోన్‌లో పవన్ చెప్పాడు. సతీష్‌ను చంపేద్దామని మనం అనుకున్నాం కదా.. ఇదే మంచి సమయం చంపేయంటూ ఫోన్‌లో రాజశేఖర్ పవన్‌కు చెప్పడంతో బీరు సీసాలతో తలపై, మెడపై సతీష్‌ను పవన్ కొట్టిచంపేశాడు. సతీష్‌ను హత్య చేసిన పవన్‌ను, హత్యకు ప్రోత్సహించిన రాజశేఖర్‌ను పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరళించినట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. హత్యకు సంబంధించిన నేరస్తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన స్థానిక ఎస్ఐ ప్రేమా నందం, ఎల్లారెడ్డిపేట ఎస్ఐ రమాకాంత్, పోలీస్ సిబ్బందిని సీఐ శ్రీనివాస్ ఈ సందర్భంగా అభినందించారు.







మైమరపించే ప్రకృతి అందాలు

షూటింగ్, పిక్నిక్ స్పాట్‌గా బతుకమ్మ కుంట ప్రాంతం

ఇటీవల కురిసిన వర్షాలతో ప్రకృతి కొత్త అందాలను సంతరించుకుంది.. జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రం సమీపంలోని బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు ఎటు చూసినా పచ్చదనంతో మైమరపింపజేస్తున్నాయి. జగిత్యాల-కమ్మునూరు రోడ్డుకు రెండు వైపులా పచ్చని టేకు చెట్లతో వాహనదారులకు ఆహ్లాదం కలిగిస్తున్నాయి. బతుకమ్మ కుంట పరిసర ప్రాంతాలు షూటింగ్‌లకు అనుకూలంగా ఉంది. ఈ ప్రాంతంలో ఫోక్ సాంగ్స్, షార్ట్‌ఫిలింల చిత్రీకరణ జరుగుతుంటుంది. ప్రీ వెడ్డింగ్ షూట్స్ ఈ ప్రాంతంలో జరుపుతుంటారు. వారాంతాలు, సెలవు రోజుల్లో పలువురు పర్యాటకులు ఇక్కడికి పిక్నిక్‌కు వస్తుంటారు. మధ్యలో కుంట, చుట్టు పచ్చని చెట్లు, ఎత్తైన కొండలు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. - సారంగాపూర్, ఆంధ్రజ్యోతి

పోలీసు ఉద్యోగం..

సమాజ సేవకు లభించిన అవకాశం

కరీంనగర్ సీపీ గౌస్ ఆలం



పీటీసీలో మొక్క నాటుతున్న సీపీ

కరీంనగర్ క్రైం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో ఉద్యోగానికి ఎంపికవడం సమాజానికి సేవ చేసేందుకు లభించిన మంచి అవకాశమని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం అన్నారు. గతంలో వెలువడిన పోలీసు కానిస్టేబుల్ నోటిఫికేషన్‌లో ఎంపికై వివిధ కారణాలతో హాజరుకాని 91 మందికి కరీంనగర్ పీటీసీలో సోమవారం శిక్షణ ప్రారంభించి మాట్లాడారు. దేశంలోనే తెలంగాణ పోలీసుశాఖ మొదటి స్థానంలో నిలిచిందని, తొమ్మిది నెలల పాటు అందించే శిక్షణను క్రమశిక్షణతో నేర్చుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధి నిర్వహణలో ఉపయోగపడతాయన్నారు. అంతకుముందు గౌరవ వందనం స్వీకరించిన సీపీ పీటీసీ ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో పోలీస్ ట్రైనింగ్ కాలేజ్(పీటీసీ) ప్రిన్సిపాల్, అడిషనల్ ఎస్పీ పిచ్చయ్య, వైస్ ప్రిన్సిపాల్ మోహన్(డీఎస్పీ), డీఎస్పీలు మల్లికార్జున్, మహేష్‌బాబు, శ్రీనివాస్, విజయపాల్‌రెడ్డి, గంగాధర్, శివరామయ్య పాల్గొన్నారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా

అభివృద్ధి పనులు

- వేములవాడలో రోడ్ల విస్తరణతో సుదీర్ఘ నిరీక్షణకు తెర
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : నానాటికీ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగిన అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఇందులో భాగంగానే ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రోడ్ల వెడల్పు కార్యక్రమాన్ని చేపట్టామని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పులో భాగంగా ఇరువైపులా ఇళ్లను కూల్చివేసే కార్యక్రమం ప్రారంభమైన సందర్భంగా సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

వేములవాడ రాజన్న సన్నిధిలో అభివృద్ధికి శ్రీకారం చుట్టే క్రమంలో రోడ్ల వెడల్పు పనులు ఆదివారం నుంచి ప్రారంభమయ్యాయని, ప్రస్తుతం ఉన్న రోడ్డును 80 అడుగుల మేరకు విస్తరించేందుకు అవసరమైన పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. గత నవంబరు 20న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 8 మంది మంత్రుల సమక్షంలో 76 కోట్లతో ఆలయ విస్తరణ, 47 కోట్లతో రోడ్డు వెడల్పు కోసం, 35 కోట్లతో అన్నదాన సత్ర నిర్మాణం కోసం శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధితో పాటు, వేములవాడ పట్టణ అభివృద్ధి కోసం 2024-25 ఆర్థిక సంవత్సరంలో 50 కోట్లు, 25-26 బడ్జెట్లో 100 కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు. వేములవాడ పట్టణంతో పాటు శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి పనులను సమాంతరంగా చేపడుతున్నట్లు తెలిపారు. వేములవాడ పట్టణంలో రోడ్డు వెడల్పు చేయాలని గత 30 ఏళ్లుగా స్థానికులు కోరుకుంటున్నారని, గత ప్రభుత్వంలోగా కేవలం మాటలకు శంకుస్థాపనలకు పరిమితం



మాట్లాడుతున్న విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

కాకుండా అభివృద్ధిని ఆచరణలో చూపిస్తూ రోడ్ల వెడల్పు పనులు ప్రారంభించామని అన్నారు. శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయాన్ని నాలుగు ఎకరాలలో విస్తరించేందుకు ఇప్పటి వరకు నాలుగు సార్లు శృంగేరి పీఠాధిపతి వద్దకు వెళ్లి వారి సలహాలు సూచనలు స్వీకరించి, వాటి ప్రకారం ముందుకు సాగుతున్నామని తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రాజన్న భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తామని, శ్రీ స్వామివారి శీఘ్రదర్శనం కలిగేలా ఏర్పాటు చేస్తామని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజన్న ఆలయం మెట్లమీద ఇచ్చిన హామీని తప్పాడని, తన పెళ్లి ఇక్కడే అయ్యిందని ప్రజలను మభ్యపెట్టి తక్షణమే 100 కోట్ల రూపాయలు విడుదల చేస్తానని మోసం చేశారని గుర్తు చేశారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు రాజన్న ఆలయం ఎలా ఉందో ఇప్పటి వరకు అలాగే ఉందని, రంగురంగుల బ్రోచర్లలో మాత్రమే అభివృద్ధిని చూపించారని ఒక్క ఇటుక కూడా పేర్చలేదని అన్నారు. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు అమలవుతున్నాయన్నారు. రోడ్డు వెడల్పులో భూములు కోల్పోతున్న వారికి 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించామని, అయినప్పటికీ రోడ్ల వెడల్పు కోసం భూ నిర్వాసితుల త్యాగాన్ని ఎట్టి పరిస్థితుల్లో మరువబోమన్నారు. మెయిన్ రోడ్‌లో ఎన్నో ఏళ్లుగా వ్యాపారాలు నిర్వహించుకుంటున్న దుకాణదారులకు ప్రభుత్వం చేదోడు వాదోడుగా ఉంటుందని, పట్టణ ప్రజలకు, యాత్రికులకు ఇబ్బంది కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని అన్నారు. రానున్న రోజుల్లో వేములవాడను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్లే విధంగా కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు.

బడుగు, బలహీన వర్గాలకు

మంత్రి పదవులు

- సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారు
- మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

వేములవాడ కల్చరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు చెందిన తనకు గడ్డం వివేక్‌కు, వాకిటి శ్రీహరిలకు ఒకే రోజు మంత్రి పదవులు ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. సోమవారం వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చిన ఆయన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి ఆలయ గెస్టుహౌస్‌లో విలేకర్లతో మాట్లాడారు. మా ఇంటి ఇలవేల్పు, కుల దైవం వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారన్నారు. అమ్మవారి దర్శనం అనంతరమే ఏ కార్యక్రమైనా మొదలు పెడుతామని చెప్పారు. 1984 నుంచి ఎన్ఎస్‌యూఐ నుంచి మొదలుకొని నేటి వరకు కాంగ్రెస్‌లో తన ప్రయాణం కొనసాగుతుందని అన్నారు.

అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు చేపట్టిన భారత్ జూడోయాత్ర దేశ రాజకీయాలన మార్చిందని అన్నారు. ఈ యాత్ర సామాజిక న్యాయానికి పునాది వేసిందని అన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా, ప్రమాదం ఉందని తెలిసినా రాహుల్‌గాంధీ యాత్రను కొనసాగించడం చరిత్రాత్మకమని కొనియాడారు.

సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని, అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే రైతులకు రుణమాఫీ, సన్న బియ్యం, రికార్డ్ స్థాయిలో రేషన్ కార్డుల పంపిణీ, మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయా ణం, 59వేల ఉద్యోగాలను ఇచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వం మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని విమర్శిం చారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఇలాంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే సోషల్ జస్టిస్‌కు కేరాఫ్ అని తెలిపారు. ధర్మపురి ప్రజల దీవెనలతో, కాంగ్రెస్‌పార్టీ అగ్రనేతల ఆశీస్సులతో, సీఎం రేంత్‌రెడ్డి కృషితో నాకు అప్పగించిన మంత్రి పదవిని సమర్థవంతంగా నిర్వ హించేందుకు కృషి చేస్తానని తెలిపారు.



మంత్రి అడ్లూరికి రాజన్న చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈవో రాధాబాయి

రాజన్నను దర్శించుకున్న మంత్రి అడ్లూరి

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దర్శించుకున్నారు. ఆదివారం రాత్రి ఆలయానికి చేరుకున్న మంత్రి సోమవారం ఉదయం శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభతో ఘన స్వాగతం పలికారు. రాజన్న ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీస్వామి వారి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించారు. ఆలయ ఈవో రాధాబాయి శ్రీస్వామి వారి శేషవస్త్రం, రాజన్న చిత్రపటాన్ని అందజేశారు.

ప్రధాన సమస్యలపై దృష్టి మరల్చేందుకే

ఏసీబీ విచారణ పేరుతో హడావుడి

- బీఆర్‌ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటాం
- నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమ స్యలపై దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణ పేరుతో ప్రభుత్వం హడావుడి చేస్తోందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. కేటీఆర్ విచారణ సందర్భంగా తెలంగాణ భవన్‌కు తాళం వేయడం దుర్మార్గమని, బీఆర్ఎస్ లోపాలు అంతర్గతంగా సవరించుకుంటామని, మాపై బయటి వారు ఎవరైనా దాడి చేస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటామని ఆమె పేర్కొన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం నవదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుం దన్నందుకే నోటీసులు, విచారణల పేరుతో కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆమె విమర్శించారు. ఏ పార్టీలోనైనా లోపాలు ఉన్నప్పుడు అధినేతకు చెప్పుకోవడం సహజంగా జరుగుతుందన్నారు. చెప్పుకున్నంత మాత్రాన దాన్నేదో భూతద్దంలో చూపించాల్సిన అవసరం లేదన్నారు.

వానాకాలం పంట సీజన్ మొదలైనప్పటికీ రైతులు రైతు భరోసా సాయం కోసం ఎదురుచూస్తున్నారన్నారు. హామీల అమలుపై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తోందని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారణ చేసిందని, తాజాగా కేటీఆర్‌ను ఏసీబీ విచారి స్తోందన్నారు. బీఆర్ఎస్ నేతలు వేధింపులకు భయపడే వాళ్లు కాదని.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారని వివరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. జగిత్యాల నవదుర్గ ఆలయ అభివృద్ధికి ఎంపీ దామోదర్ రావు ఎంపీ లాడ్స్ నుంచి రూ.90 లక్షలు కేటాయించారని, జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ మరో రూ.10 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, జగిత్యాల, రాయికల్ మాజీ ఏఎంసీ చైర్మన్లు శీలం ప్రియాంక, ఉదయశ్రీ, నాయకులు మారంపల్లి రాణి, మహేశ్, సంధ్యారాణి, శారద, తుమ్మ గంగాధర్, బర్కము మల్లేశం, అనిల్, తేలు రాజు, గంగారెడ్డి, అనుధార, తిరుపతి, ప్రణయ్ పాల్గొన్నారు.

ఎల్ఎల్ఎం సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, జూన్, 16(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో 2025 ఏప్రిల్‌లో నిర్వహించిన ఎల్ఎల్ఎం ఒకటో, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను సోమవారం విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ సురేష్ కుమార్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం నరమేధాన్ని

విరమించుకోవాలి

- మావోయిస్టుల పేరుతో ఆదివాసులను అంతం చేయడం సరికాదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



సిరిసిల్లలో సీపీఐ మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే సాంబశివరావు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత పేరుతో కేంద్రం ప్రభుత్వం చేపట్టిన నరమేధం విరమించుకోవాలని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూననేని సాంబశివరావు డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సోమవారం సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నాలుగవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి లహరి ఫంక్షన్ హాల్ వరకు భారీ ర్యాలీ తీశారు. లహరి ఫంక్షన్‌హాల్‌లో మహాసభల సందర్భంగా సీపీఐ జెండాను ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ నాయ కురాలు అనసూర్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే సాంబశివరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతలో భాగంగా దండకారుణ్యంలో ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వంతో కలిసి నరమేధాన్ని సృష్టిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయించుకునేందుకు పోరాటాలు చేయాలన్నారు. బీజేపీ మతవాద పార్టీకి వ్యతిరేకంగా తెలంగాణ గడ్డమీద కరుడుగట్టిన ఆ పార్టీని అడుగు పెట్టనీయ కుండా ప్రజలందరం ఐక్యం కావాలన్నారు. గత పాలకులు అనేక భూఆక్రమణలకు పాల్పడి నిరుపేద భూములను తీసుకున్నారన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో వీలైన మేరకు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలన్నారు. దీనికి కోసం ఇప్పటినుంచే బలంగా ఉన్న ప్రాంతాలల్లో ప్రచారం చేపట్టాలన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శిగా మంద సుదర్శన్ నియమాకం

రాజన్న సిరిసిల్ల జిల్లా సీపీఐ జిల్లా కార్యదర్శిగా ఇల్లంతకుంట మండలం వెంట్రావుపల్లె గ్రామానికి చెందిన మంద సుదర్శన్‌తో పాటు 9మంది సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభలో పలు తీర్మాణాలను అమోందించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యదర్శి గుంటి వేణు, కడారి రాములు, మీసం లక్ష్మన్, పంతం రవి, ఎలిగేటి రాజశేఖర్, భూంపెల్లి భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గోదావరిఖనిలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విమలక్క

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గోదావరిఖని: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని అరుణోదయ కళా సంఘం గౌరవ అధ్యక్షురాలు విమలక్క డిమాండ్‌చేశారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన నిరసన సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేస్తుందని, కేంద్ర బలగాలతో అడవులను జల్లెడ పడుతూ ఆదివాసీలను అడవుల నుంచి వెళ్లగొట్టి ఖనిజ సంపదను అదాని, అంబానీలకు దోచి పెట్టడానికి కుట్ర చేస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, అమిత్‌షాలు 2026వరకు మావోయిస్టు పార్టీని అంతం చేయడానికి కంకణం కట్టుకున్నారని, దీనిని ప్రజాస్వామ్య వాదులు ఖండించాలని, ఎన్‌కౌంటర్ల పేరుతో 570మందిని హత్య చేశారని ఆరోపిం చారు. కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలు జరుపాలని డిమాండ్ చేశారు. గోదావరిఖని చౌరస్తా నుంచి నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం అమరవీరుల సంస్మరణ సభను నిర్వహించారు. విశ్వనాథ్, రత్న కుమార్, విజయ్‌కుమార్, ఆరెల్లి కృష్ణ, మాదన కుమారస్వామి, మాదాసు రామమూర్తి, ముడిమడుగుల మల్లన్న, తాండ్ర సదానందం, రాజన్న పాల్గొన్నారు.

ఎస్సారార్ కళాశాలలో కొత్త కోర్సు

గణేశ్‌నగర్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి బీకాం(రిటైల్ ఆపరేషన్స్) అనే కొత్త డిగ్రీ కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, సురేందర్‌రెడ్డి, వాణిజ్య విభాగ అధ్యక్షుడు టి.రాజయ్య, దోస్త్ కోఆర్డినేటర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రిటైల్ రంగం ప్రాధాన్యం దృష్ట్యా ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాయోగిక పరిజ్ఞానం, నైపుణ్యాలను అందించేందుకు రూపొందించినట్లు తెలిపారు. విద్యార్థులు దోస్త్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

కండక్టర్ లేకుండానే బస్సు తీసుకువెళ్లిన డ్రైవర్

కళ్యాణ్ నగర్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కండక్టర్ లేకుండానే డ్రైవర్ బస్సును తీసుకువెళ్లిన ఘటన సోమవారం గోదావరిఖని బస్టాండ్‌లో చోటుచేసుకుంది. గోదావరిఖని డిపోకు చెందిన టీఎస్02 జెడ్-0286 బస్టాండ్‌లో కరీంనగర్‌కు ప్రయాణికులను ఎక్కించుకున్నారు. కండక్టర్ లేకుండానే బస్సును డ్రైవర్ మున్సిపల్ కార్పొరేషన్ టీ జంక్షన్ వరకు తీసుకు వెళ్లారు. కండక్టర్ లేదని ప్రయాణికులు చెప్పినప్పటికి వినకుండా బస్సును తీసుకు వెళ్లాడు. బస్సులో ప్రయాణికుడు ప్రవీణ్ డిపోమేనేజర్ నాగభూషణానికి ఫిర్యాదు చేశాడు. దీంతో డ్రైవర్ బస్సును తిరిగి బస్టాండ్‌కు తీసుకు వచ్చారు. అందులో ఉన్న ప్రయాణికులు దిగి మరో బస్సులో వెళ్లిపోయారు. డ్రైవర్ నిర్లక్ష్యంగా కండక్టర్ లేకుండా బస్సును తీసుకు వెళ్లాడని, తాము చెప్పిన వినలేదని, అత్యవసర పరిస్థితుల్లో వెళ్లే వారి పరిస్థితి ఏమిటని ప్రయాణికులు ప్రశ్నించారు.

గుట్టల మట్టి మాయం..

- వందలాది టిప్పర్లు, ట్రాక్టర్లతో అక్రమంగా తరలింపు
- పట్టించుకోని రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు
- రెచ్చిపోతున్న అక్రమార్కులు

హుజూరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని గుట్టల్లోని మట్టిని అక్రమార్కులు మాయం చేస్తున్నారు. పచ్చదనంతో కనబడే గుట్టలు నేడు బొందల గడ్డలుగా మారాయి. గుట్టలు ఉంటే చాలు టిప్పర్లు, ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. హుజూరాబాద్ పట్టణ శివారులోని రంగాపూర్, సిర్సపల్లి, కొత్తపల్లి, గణేష్‌నగర్, బోర్నపల్లి, ఎలబోతారం గ్రామాల్లో ప్రభుత్వ గుట్టలు మట్టితో నిండి ఉన్నాయి. వీటిపై కొంత మంది అక్రమార్కులు కన్ను పడింది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా మట్టిని రవాణా చేస్తున్నా సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రభుత్వ గుట్టల నుంచి బహిరంగంగా ఎక్స్‌కవేటర్ల సహాయంతో మట్టిని తవ్వుతున్నారు. హుజూరాబాద్‌లో ఇటీవల ఇళ్ల నిర్మాణం బాగా పెరిగింది. దీనికి మట్టి అవసరం ఉండగా, పరిసరా ప్రాంతాల్లో దొరకడం లేదు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు మట్టిని వ్యాపారం చేస్తున్నారు.



టిప్పర్ మట్టికి రూ. రెండు వేలు

హుజూరాబాద్‌లో టిప్పర్‌కు 1700 నుంచి రెండు వేల రూపాయల వరకు తీసుకుని మట్టిని తరలిస్తున్నారు. గతంలో పచ్చదనంతో కళకళలాడిన గుట్టలు ఇప్పుడు భారీ గుంతలుగా మారాయి. మట్టిని తరలిస్తున్నవారు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులకు మామూళ్లు ముట్టజెబుతున్నామని బహిరంగంగా చెబుతున్నారు. గుట్టల నుంచి మట్టిని తరలిస్తుండడంతో వన్యప్రాణులు గ్రామాల్లోకి తరలి వస్తున్నాయి. గుట్టల నుంచి తీసుకొచ్చిన మట్టిని కొత్తపల్లి, గణేషనగర్, రంగాపూర్ గ్రామాల శివారుల్లో డంప్ చేస్తు న్నారు. అక్కడి నుంచి అవసరము న్న వారికి సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ దందాపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



హుజూరాబాద్ మండలం రంగాపూర్‌లో గుట్టల వద్ద తవ్విన మట్టి



బొందలగడ్డగా మారిన గుట్టలు

రాజేందర్, గ్రామస్థుడు, రంగాపూర్

ఒకప్పుడు పచ్చదనంతో ఉండే గుట్టలు నేడు బొందలగడ్డగా మారాయి. గుట్టల్లో నుంచి మట్టిని అక్రమంగా తోడేస్తున్నారు. నిత్యం వేలాది ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించాలి.

రేపు క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక

ఎల్లారెడ్డిపేట, జూన్16(ఆంధ్రజ్యోతి): క్రీడా పాఠశాలల్లో నాల్గో తరగతిలో ప్రవేశాల కోసం ఈ నెల 18న ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో విద్యార్థుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నామని ఎంఈవో కృష్ణహరి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి స్థాయి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్ 7702579180ను సంప్రదించాలని తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



వేలాడుతున్న కరెంటు తీగలను చూపిస్తున్న గ్రామస్థులు

ఎల్లారెడ్డిపేట, జూన్16(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం కిష్టునాయక్ తండాలో ప్రమాదకరంగా కరెంటు తీగలను సరిచేయాలని కోరుతూ తండావాసులు సోమవారం నిరసనకు దిగారు. కిందకు వేలాడుతున్న తీగల వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోయారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గాలికి విద్యుత్ తీగలు రాపిడి జరిగి నిప్పురవ్వలు ఎగిసి పడుతున్నాయని పేర్కొన్నారు. ఎప్పుడేం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నామని అన్నారు. ఇప్పటికైనా 'సెస్' అధికారులు స్పందించి కిందకు వేలాడుతున్న తీగలను సరిచేసి ప్రమాదాలను నివారించాలని గిరిజనులు కోరారు.

గ్రామ దేవత ఆలయం నిర్మించాలి



నిమ్మపల్లిలో చెట్టు కింద పోచమ్మ తల్లి

కోనరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ఏ ఇంటిలోనైనా శుభకార్యం జరిగే ముందు గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి పూజలు చెల్లించిన తర్వాతనే మిగతా శుభకార్యాలు ప్రారంభిస్తారు. అలాంటి తల్లికి గుడి లేదు, అంతే కాకుండా నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామంలో గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి గుడి నిర్మించి, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని నిమ్మపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. పోచమ్మ తల్లికి పూజా కార్యక్రమాలు చేయడానికి వెళ్లిన భక్తులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పోచమ్మ తల్లి ఆలయం వద్ద ఒక బోరు బావి ఏర్పాటు చేసి గుడిని నిర్మించాలని ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

ఎల్లారెడ్డిపేట, జూన్16(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని నాయబ్ తహసీల్దార్ మురళీకృష్ణ అన్నారు. ఎల్లారెడ్డిపేట, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో సోమవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను తీర్చేందుకు సదస్సులను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్నామని అన్నారు. క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, గౌస్, గిరిధర్‌రెడ్డి, బాబు, శ్రీపాల్‌రెడ్డి, సూర్యనాయక్, చంద్రారెడ్డి, పద్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, రవి, చందు, బాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, తహసీల్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినిపల్లి జూన్ 16 (ఆంధ్ర జ్యోతి): బోయినపల్లి మండలం తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్ ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబసభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం పరామర్శించారు. సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం చేసి కుటుంబాన్ని రెండు రోజులలోగా ప్రభుత్వం తరుపున అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీసెల్ అధ్యక్షులు కూస రవీందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, తడగొండ మాజీ ఎంపీటీసీ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుడి శేఖర్ రెడ్డి, ఎండి బాబు, మెరుపుల మహేష్, మండల కాంగ్రెస్ నాయకులు కట్ట లచ్చయ్య పిట్టల రమేష్, ఎండి మహమ్మద్, కట్ట బాబు, కేశవరెడ్డి, రఫీ మూదం శీను కొండ శంకరయ్య, కాడే భాస్కర్, వినయ్, శంకర్, కల్లేపల్లి లక్ష్మణ్ ఉన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలి



రాజుపేట పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

గంభీరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం రాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరిపడు ఉపాధ్యాయులను నియమించాలని సోమవారం విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన తెలిపారు. పాఠశాలలో 40 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయులు ఉన్నారని వాపోయారు. ఈ విషయమై మండల స్థాయి అధికారులకు చెప్పినా ఫలితం లేదని పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపడు ఉపాధ్యాయులను నియమించాలని జిల్లా కలెక్టర్‌ను ఈ సందర్భంగా కోరారు.

వేములవాడలో వేగం పుంజుకున్న కూల్చివేతలు

● 200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ● పనులు పరిశీలించిన కలెక్టర్



వేములవాడ ప్రధాన రోడ్డులో కూల్చివేతలు



కూల్చివేత పనులు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

వేములవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన ఇళ్లు, భవనాల కూల్చివేత పనులు వేగం పుంజుకున్నాయి. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు ఆదివారం కూల్చివేత పనులకు శ్రీకారం చుట్టిన వివిధ విభాగాలకు చెందిన అధికారులు తొలి రోజు మున్సిపల్‌కు చెందిన మటన్ మార్కెట్ నిర్మాణాన్ని తొలగించారు. రెండవ రోజు సోమవారం తెల్లవారు జాము నుంచి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లు, భవనాలను తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు. రోడ్ల వెడల్పులో 243 భవనాలను తొలగించాలని అధికారులు అంచనాకు వచ్చి ఈ మేరకు యజమానులకు నోటీసులు జారీచేసి, పలువురికి ఇప్పటికే నష్టపరిహారం అందజేయగా, తమకు అన్యాయం జరుగుతున్నదంటూ 88 ఇండ్లు, భవనాల యజమానులు కోర్టును ఆశ్రయించి స్టే పొందడంతో వాటిని మినహాయించి మిగతా నిర్మాణాలను తొలగించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు రాజన్న ఆలయం ముందు భాగం నుండి మూలవాగు బ్రిడ్జి వరకు ఇరువైపులా ప్రతి నిర్మాణాన్ని తొలగించే క్రమంలో కొంత కొంత భాగాన్ని కూల్చివేశారు. ఇండ్ల కూల్చివేత పనులను పర్యవేక్షించేందుకు వివిధ విభాగాలకు చెందిన 10 బృందాలను నియమించగా, 10 జెసిబిల సహాయంతో కూల్చివేత పనులు కొనసాగుతున్నాయి. ఇండ్ల తొలగింపు పనులు ఇప్పుడే ప్రారంభం కావులే అన్న ధీమాతో కొంతమంది ఆయా ఇండ్లు, భవనాలలోని సామగ్రిని తరలించకపోవడంతో అధికారులు కూలీల సహాయంతో సామగ్రిని తొలగిస్తున్నారు. ఇళ్లు, భవనాలకు కూల్చివేత సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య నేతృత్వంలో సుమారు 200 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. భవనాల తొలగింపు పనులను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం పరిశీలించారు. భవనాల తొలగింపు పనులు మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ ఆర్డీవో రాధాభాయి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, పట్టణ సీఐ వీరప్రసాద్ పనులను పరిశీలిస్తున్నారు.

ప్రీస్కూల్ విద్య అందేనా?

(5వ పేజీ తరువాయి)

ప్రాజెక్ట్ పరిధిలో 362 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 30 టీచర్ పోస్టులు, 105 ఆయాలు, వేములవాడ ప్రాజెక్ట్ పరిధిలో 225 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 13 టీచర్ పోస్టులు, 69 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

40 వేల మంది లబ్ధిదారులు

జిల్లాలో సిరిసిల్ల, వేములవాడ రెండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉండగా 587 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా 40 వేలకు పైగా లబ్ధిదారులకు పౌష్టికాహారం, ఇతర సేవలు అందిస్తున్నారు. జిల్లాలో పోషకాహార లోపం తొలగించే దిశగా ఎదిగే పిల్లలు మహిళలకు ఆరోగ్య లక్ష్మీ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంతో పాటు కోడి గుడ్లు, పాలు అందిస్తున్నారు. చిన్నారులకు ప్రీ స్కూల్ విద్యను బోధిస్తున్నారు. జిల్లాలో పోషణ్ ట్రాకర్ ద్వారా 17,138 మంది పిల్లలకు బాలామృతం, టేక్ హోం రేషన్ ద్వారా కోడిగుడ్లు అందిస్తున్నారు. దీంతో పాటు 4,133 మంది గర్భిణీలు, 2,644 మంది బాలింతలు, 3 నుంచి 6 సంవత్సరాలు 15,195 మందికి ఒక పూట సంపూర్ణభోజనం, ప్రతి రోజు కోడి గుడ్డు, పాలు, పప్పు, కూరగాయలు, స్నాక్స్ అందిస్తున్నారు. పౌష్టికాహారంతో పాటు చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందిస్తున్నారు.

సహకార సంఘం ఇన్‌చార్జి చైర్మన్‌గా తిరుపతి

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట సహకార సంఘ ఇన్‌చార్జి చైర్మన్‌గా అదే సహకార సంఘం వైస్‌చైర్మన్ గొడుగు తిరుపతిని నియమించాలని జిల్లా సహకార అధికారి రామకృష్ణ ఉత్తర్వులు జారీచేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్న రొండ్ల తిరుపతిరెడ్డి వ్యక్తిగత పనులమీద అమెరికా వెళ్తున్నట్లు అనుమతి కోరినందున సంఘ బైలా ప్రకారం వైస్‌చైర్మన్‌కు సంఘ పూర్తిబాధ్యతలు అప్పగించాలని సూచించారు.

'పాలకవర్గ తీర్మాణాన్ని పట్టించుకోలేదు'

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లంతకుంట సహకార సంఘ మెజార్టీ పాలకవర్గ సభ్యుల తీర్మాణాన్ని జిల్లా సహకార అధికారి పట్టించుకోలేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. పర్సన్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అమెరికా వెళ్తున్నందున అనుమతి కోరగా మమనాయిని నవీన్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించాలని ఏడుగురు డైరెక్టర్లు తీర్మాణం చేసి జిల్లా అధికారికి విన్నవించినట్లు తెలిపారు. ఎందుకు పరిగణలోకి తీసుకోలేదని వారు ప్రశ్నించారు.

ప్రజాస్వామ్యంపై నిరంకుశ దాడులకు వ్యతిరేకంగా పోరాటం

- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు



సిరిసిల్లలో మాట్లాడుతున్న రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంపై నిరంకుశదాడులకు వ్యతిరేకంగా సీపీఎం పోరాటం చేస్తుందని, నేటి యువత కమ్యూనిస్టుల విలువలతో పాటు సోషలిస్టుల భావాలను అలవర్చుకోవాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు కోరారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో సీపీఎం పార్టీ రాజకీయ శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రపంచంలో పెట్టుబడిదారీ వ్యవస్థ. తీవ్ర సంక్షోభంలో కొనసాగుతుందన్నారు. దీనితో పేదరికం, నిరుద్యోగం, దారిద్ర్యం ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని వీటికి వ్యతిరేకంగా ఎర్ర జెండా పోరాడుతుందన్నారు. ఎర్రజెండా పని అయిపోయిందని సోషలిజం ఇకలేదని ఇజాలకు కాలం చెల్లిందని అనే మాట పాతదని, కమ్యూనిస్టు భావాలు క్రమక్రమంగా ప్రపంచంతో పెరుగుతున్నాయని అన్నారు. సోషలిస్టు దేశాలుగా ఉన్న చైనా , క్యూబా, వియత్నాం, ఉత్తర కొరియా, లావోస్, దేశాలు అమెరికా సామ్రాజ్యావాదం ఒత్తిళ్లకు తలొగ్గకుండా దీటుగా నిలబడి పోరాడుతున్నాయని అన్నారు. ప్రజల మనుగడ కోసం ఎదురయ్యే సమస్యలపై ఆహారం, వేతనాలు, ఇళ్ల స్థలాలు, సామాజిక భద్రత, ప్రయోజనాలు, ఉపాధి అవకాశాల వంటి సమస్యలపై గ్రామీణ పేదల శ్రామికవర్గ పట్టణ పేదల పోరాటాలను పెంపొందించి పార్టీ ఆధ్వర్యంలో వాటిని ఉధృతం చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామిక హక్కులు, పౌరహక్కుల రక్షణకు అనుకూలంగా పార్టీ ఉద్యమించిందన్నారు. రాజ్యాంగ బద్ధ సంస్థలను దెబ్బతీయడానికి వ్యతిరేకంగా విశాల ఐక్యతను నిర్మించడానికి సీపీఎం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, కార్యవర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, విమల, సూరం పద్మ, ఎరవెల్లి నాగరాజు, గురజాల శ్రీధర్, మల్లారపు ప్రశాంత్, శ్రీరాముల రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలలను మూసివేయాలి



జిల్లా విద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 16 (అంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన పాఠశాలపై చర్యలు తీసుకోవాలని భీమ్‌ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్ డిమండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం జిల్లా ఇంచార్జ్ వినోద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రమీణ్‌కుమార్ మట్లాడుతూ జిల్లా కేంద్రంలో ప్రతి సంవత్సరం ఎలాంటి అనుమతులు లేకుంగా పుట్టగోడుగుల్ల ప్రైవేటు పాఠశాలలు పుట్టుకువస్తున్న విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలకు రకరకాల అనుబంధ పేర్లు ఒలంపియాడ్, కాన్సెప్ట్, డీజీ, సీబీఎస్సీ, టెక్నో వంటి పేర్లను తగిలించుకుని విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని అరోపించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిభంధనల ప్రకారం పాఠశాలలు నడిచేలా చూడాలన్నారు. బహుజన సేనా జిల్లా అధ్యక్షుడు జింక శ్రీధర్ పాల్గొన్నారు.

మిడ్ మానేరు నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏటి యాదవ్

బోయినపల్లి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మిడ్ మానేరు నిర్వాసిత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు ఏటి యాదవ్ తీసుకెళ్లారు. బీఆర్ఎస్ హయాంలో నిర్వాసిత యువతకు ఎలాంటి ఉపాధి మార్గాలు చూపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాకుండా నిర్వాసితుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా కృషి చేయాలని మంత్రిని కోరారు.

మంత్రి అడ్లూరికి అభినందన



మంత్రి అడ్లూరికి అభినందనలు తెలుపుతున్న సెస్ డైరెక్టర్ సుధాకర్

బోయినపల్లి జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజన్న దర్శనార్థం వేములవాడకు వచ్చిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను సోమవారం బోయినపల్లి సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్ అభినందించారు. రాష్ట్ర మంత్రిగా నియామకమైన సందర్భంగా అడూర్లిని శాలువాతో సత్కరించి, పూల బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

అప్పుల బాధతో చిరువ్యాపారి ఆత్మహత్య

తాడ్వాయి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో చిరువ్యాపారి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్ల రాజన్న జిల్లా ముస్తాబాద్ గ్రామానికి చెందిన సత్యం(50) తన భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు పవన్, అఖిల్‌లతో కలిసి 10 ఏళ్ల క్రితం జీవనోపాధి కోసం మేడారం తరలివచ్చారు. జాతరలో చిన్న కిన్న గాజులు, పూసల దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. అప్పుల బాధలు తాళలేక మనస్తాపంలో తన దుకాణంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు



వంతడుపుల ప్రాథమిక పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



మల్కాపేటలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఇల్లంతకుంట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఎర్నసర్సుపల్లె, వంతడుపుల గ్రామాలలో సోమవారం జరిగిన కార్యక్రమాలలో మండల విద్యాధికారి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో వసతులు మెరుగయ్యాయన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి పిల్లలను పంపాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు స్వప్నరాణి, సరిత, అశోక్‌కుమార్‌లతో పాటు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **కోనరావుపేట** : నూతనంగా మొదటి సంవత్సరం అడ్మిషన్ తీసుకున్న విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. కోనరావుపేట మండలం మల్కాపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఒకటవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించి సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గీత, భారతి, శ్యామ్, మహేందర్ రావు, ఏఎంసి చైర్మన్ సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

చందుర్తి: చందుర్తి మండలం నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎఫ్ఎల్ఎన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రాథమిక అభ్యసన నైపుణ్యాలను ఎఫ్ఎల్ఎన్ వండర్ బాక్స్ ద్వారా వివరించారు. ప్రధానోపాధ్యాయులు ఎస్. జలంధర్ రెడ్డి మాట్లాడుతూ ఫౌండేషన్ లీడర్స్ అండ్ న్యూమరస్ కార్యక్రమం ద్వారా వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు. ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించి విద్యార్థులను మంచి అభ్యాసకులుగా మార్చడం జరుగుతుందన్నారు. వారి సామర్థ్యాలకు అనుగుణంగా బోధించడం జరుగుతుందని, తల్లిదండ్రులు ఆలోచించి ప్రభుత్వ పాఠశాలకు పంపాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. వీటిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. అనిత, కే. శ్రీధర్, బి. రాజు, ఎస్. రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎఫ్ఎల్ఎన్ పద్ధతిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ

కోనరావుపేట, జూన్ 16 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ పెరుగుతోందని కోనరావుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు అజ్మీరా మదన్‌లాల్ అన్నారు. కోనరావుపేట ప్రాథమిక పాఠశాలలో మాజీ జడ్పీటీసీ రుక్మిణి మనవడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించగా నూతన అడ్మిషన్ ఇచ్చిన హెచ్‌ఎం ఈ సందర్భంగా మాట్లాడారు. ఈ సంవత్సరం 72 మంది నూతన విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నట్లు తెలిపారు. దీనికి సహకరించిన ప్రజాప్రతి నిధులు గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో నూతన విద్యా బోధన అందిస్తున్నామని అన్నారు. ప్రస్తు తం తమ పాఠశాలలో 25 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భాస్కర్, రాము, వెంకటేష్, సంజు, శృతి, అనూష తదితరులు ఉన్నారు.



మనవడి కోసం అడ్మిషన్ తీసుకుంటున్న మాజీ జడ్పీటీసీ రుక్మిణి